ప్రజాశక్తి

మంగళవారం 4 ఫిబ్రవరి 2025

5

అల్లూరి సీతారామరాజు

అనుమానాస్పదస్థితిలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాల విద్యార్థి సుర్ల విశ్వతేజ ఉరివేసుకొని మృతి చెందిన ఘటన మండలంలోని చోటుచేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు గూడెం కొత్త వీధి మండలం లక్కవరపేట గ్రామానికి చెందిన సుర్ల విశ్వతేజ చింతపల్లి ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం హెచ్ఈసి చదువుతున్నాడు. విశ్వతేజ సంక్రాంతి పండగ సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి కళాశాలకు రాలేదు. ఫిబ్రవరి ఒకటి నుంచి కళాశాలలో ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షలు రాయవలసి ఉన్నప్పటికీ కళాశాలకు విశ్వతేజ రాలేకపోయిన కారణంగా పరీక్ష కు హాజరు కాలేదని అధ్యాపకులు తెలిపారు. సోమవారం ఉదయం గిరిజన గురుకుల కళాశాల యూత్ శిక్షణ కేంద్రం (వైటిసి) వెనకాల రేకుల షెడ్డులో ఉరి వేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రయాణం..ప్రమాదభరితం

-పరిమితికి మించి జీపుల్లో గిరిజనుల రాకపోకలు

ప్రజాశక్తి-చింతపల్లి: తాము ప్రయాణం చేసేది సాహసోపేతమైన ప్రయాణమైనా తప్పని పరిస్థితుల్లో గిరిజనులు జీపులను ఆశ్రయిస్తున్నారు. చింతపల్లి, జి.మాడుగుల మండలాలకు చెందిన తమ్మెంగుల, కుడుముసారి, లువ్వాసింగి పంచాయతీల సరిహద్దు గ్రామాల ప్రజలు అన్నవరం వారపు సంతకు, లోతుగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళాలంటే ప్రాణాలను తెగించి ప్రయాణం చేయాల్సిందే. సోమవారం అన్నవరం గ్రామంలో జరిగిన వారపు సంతకు భీమనపల్లి, బొడ్డపుట్టు, కిలుములు, వంచెబు దుర్గం, సంపంగిపుట్టు, సంకులమిద్దే, అలగం, కిలిమిసింగి తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ప్రైవేటు వాహనంలో సాహసోపేత ప్రయాణం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు కానీ తమ ప్రాంతాలకు రహదారి, వంతెన నిర్మాణాలు చేపట్టడం లేదని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. పాలకుల తమను ఓటర్లుగానే తప్పా ఏనాడూ మనుష్యులుగా చూడలేదని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమ గ్రామాలకు తారు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజల వాపోతున్నారు.

జీపు టాపుపై కూర్చుని వెళుతున్న గిరిజనులు

ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజనసంఘం ఆధ్యర్యంలో ఆ గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, గత ఏడాదిలో జల జీవన్ పథకం ద్వారా తవ్విన బోరు నిరుపయోగంగా ఉండడంతో మంచి నీరు అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు నిరుపయోగంగా ఉన్న బోరును వినియోగంలోకి తెచ్చి మంచినీరు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తిలక్, శ్రీనివసరావు, కె.రాందాస్, సీతారాం, జగత్, తిరుపతి పాల్గొన్నారు.

పిఒగా జెసికి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ పిఒగా అదనపు బాధ్యతలను జాయింట్ కలెక్టర్ .ఎం.జె.అభిషక్ గౌడ (2020 ఐఎఎస్) సోమవారం స్వీకరించారు. బదిలీపై వెళుతున్న పిఒ వి.అభిషేక్ రిలీవ్ అయ్యారు. అభిషేక్ గౌడ్ 2024 జూలై 22 నుండి జాయింట్ కలెక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు. నూతన పిఒగా బాధ్యతలు స్వీకరించిన ఎం.జె.అభిషేక్ గౌడ్‌కు ఐటిడిఎ ఎపిఒలు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, పరిపాల నాధికారి ఎం.హేమలత, టిడబ్ల్యూ డిడి ఎల్.రజని, డిఆర్ డిఎ పిడి వి.మురళి, గురుకులం ప్రిన్సిపాల్ పిఎస్ఎన్ మూర్తి, టిడబ్ల్యూ ఇఇ జి.డేవిడ్ రాజు, ఎఇ దుర్గా ప్రసాద్, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న అభిషేక్ గౌడ్

రోడ్డు స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయితి పెదబయలు ప్రధాన కేంద్రంలో భగత్ సింగ్ నగర్ (వాటర్ ట్యాంక్ వీధి)కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని ఆ వీధి ప్రజలు సోమవారం స్థానిక సర్పంచి పలాసి మాధవరావుకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ వీధిలో 25 కుంటుబాలు 30 జీవిస్తున్నామని, తాము గృహాలు నిర్మించుకునే సమయంలో ఉన్న రోడ్డును ఓ వ్యక్తి ఆక్రమించి కంచే వేశారని తెలిపారు. దీంతో భగత్ సింగ్ నగర్ కు రోడ్డు సౌకర్యం లేక మంచినీళ్ల తెచ్చుకోవడానికి కూడా వీలుపడక నానావస్థలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రోడ్డును ఆక్రమించుకోవడంతో అత్యవసర సమయాల్లో అవస్థలు పడవలసి వస్తుందన్నారు.రోడ్డు సౌకర్యం లేక వీధి బోరు మంజూరైనా బోర్ రిగ్గు వాహనం రావడానికి కుదరకపోవడంతో ఆ నిధులు కాస్త వెనక్కి వెళ్ళిపోయా యని తెలిపారు. ఈ విషయమై గతంలో అధికారులకు వినతి పత్రాన్ని అందించడం జరిగిందన్నారు.

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో తగిన గుర్తింపు పొందాలని కాకినాడకు చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు అల్లూరి సురేంద్రరాజు సూచించారు. మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినిలకు ప్రముఖ యోగ గురువు పతాంజలి శ్రీనివాస ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో బాలికలకు చదువు చాలా ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించి నడుచుకోవాలని చెప్పారు. తల్లిదండ్రుల తరువాత స్థానంలో విద్యను నేర్పే గురువులన్నారు. సమావేశ అనంతరం యోగ గురువు శ్రీనివాస్ విద్యార్థినిలతో పున్నశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫణీంద్ర, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు

వైసిపి బలోపేతానికి కృషి

అల్లూరి జిల్లా కల్చరల్ యాక్టివిటీస్ అధ్యక్షుడు మత్స్య రాజు

ప్రజాశక్తి - చింతపల్లి : కల్చరల్ యాక్టివిటీస్ తో పాటు వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ అల్లూరి జిల్లా కల్చరల్ యాక్టివిటీస్ అధ్యక్షునిగా నియమితులైన దాసరి మత్స్యరాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, తనను పార్టీ ఇన్నాళ్లకు గుర్తించి కల్చరల్ యాక్టివిటీస్ అల్లూరి జిల్లా అధ్యక్షునిగా నియమించడం సంతోషకరమన్నారు. పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పాడేరు శాసనసభ్యుడు మత్యరాస విశ్వేశ్వర రాజు, అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనుజా రాణి, మాజీ శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రతి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం జరిగిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, రైతులకు రైతు భరోసా, అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా పెన్షన్ అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికు దక్కుతుందన్నారు. మన్య ప్రాంతంలో ప్రజలంతా వైకాపా వెంటే ఉన్నారని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అందరి సహకారంతో మన్య ప్రాంతంలో వైకాపాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

కరాటే పోటీల్లో హర్షవర్ధన్ సత్తా

ప్రజాశక్తి హుకుంపేట: స్థానిక పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జి వి వి సత్యనారాయణ కుమారుడు హర్షవర్ధన్ విశాఖ పోర్టు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎనిమిదోవ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 లో అండర్ 14 కేటగిరీలో సత్తా చాటాడు. మూడవ స్థానంలో రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ బహుమతి ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదగా అందుకున్నాడు. హర్షవర్ధన్‌ను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ, ఎక్కువ శాతం తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో చదువుపై శ్రద్ధ పెట్టాలని చెపుతారన్నారు. తన తల్లిదండ్రులు చదువుతోపాటు ఏదో ఒక రంగంలో రాణించాలని చెప్పేవారన్నారు. తన ప్రతిభను వెలికి తీసిన తన తల్లిదండ్రులకు జీవితాంతం రుణపడి ఉంటానని, రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు గెలిచేందుకు అహర్నిశలు శ్రమిస్తానన్నాడు.



సత్తాచాటిన హర్షవర్ధన్

మోదమాంబ పాఠశాలలో అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మోదమాంబ పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులచేత అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్షరాభ్యాసం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 200 మంది చిన్నారులు, తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపల్ నాగమణి, వైస్ స్ ప్రిన్సిపాల్ సీతారాం, కరస్పాండెంట్ కురుస నాగభూషణం, పాఠశాల సిబ్బంది హాజరయ్యారు.

అక్షరాలను దిద్దిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

అన్నవరం బ్రిడ్జి మరమ్మతులు చేపట్టేనా?

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని అన్నవరం, ఉమ్మడివరం గ్రామాల మధ్యలో వాగుపై లెవెల్ బ్రిడ్జి మరమ్మతుల కోసం నిధులు మంజూరైనా నేటికీ పనులు మొదలు పెట్టకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మూడేళ్ల క్రితం వరదలు కారణంగా అన్నవరం వాగుపై బ్రిడ్జి పూర్తిగా కూలిపోయి కొట్టుకుపోయింది. దీంతో దాని పక్కనే తూములతో తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణం చేశారు. అయితే గతేడాది వరదలకు తాత్కాలిక బ్రిడ్జి కూడా దెబ్బతిన్నది. దీనిపై సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. అయితే ఇప్పటి వరకు బ్రిడ్జి మరమ్మతు పనులు మొదలు పెట్టలేదు. ఈ సీజన్‌లో పనులు చేపట్టకపోతే వర్షాలు వస్తే పనులు జరిగే అవకాశం ఉండదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పనులు ప్రారంభించకపోవడానికి కాంట్రాక్టరు నిర్లక్ష్యమా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

బస్సులు పునరుద్ధరణ జరిగేనా?

అన్నవరం వాగుపై బ్రిడ్జి కూలిపోవడంతో నాటి నుండి ఈ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. దీంతో నాటి నుండి వాగుకు అవతల ఉన్న సుమారు 42 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. రైతులు పనిముట్లు తెచ్చుకోడానికి, తమ వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న తాత్కాలిక బ్రిడ్జి మీద నుండి భారీ వాహనాలు రాకపోకలు సాగించే వీల్లేకపోవడంతో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రైవేటు నిర్మాణాలకు మెటీరియల్ తేవడం సాధ్యం కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టాలని, బస్సులు పునరుద్ధరణ చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

వరద ప్రవాహానికి దెబ్బతిన్న అన్నవరం తాత్కాలిక బ్రిడ్జి

కేంద్ర బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితులకు అన్యాయం

ప్రజాశక్తి-కూనవరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య అన్నారు. కూనవరం మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజనులు పోలవరం కోసం సర్వం త్యాగం చేస్తే, ఆ నిర్వాసితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూనవరం మండలంలోని 56 గ్రామాలకు గాను 50 గ్రామాలు పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల ప్రతి సంవత్సరం ముంపునకు గురవుతున్నాయని, కాని మండలంలోని బొజ్జరాయిగూడెం గ్రామ నిర్వాసితులకు మొదటి నుండి న్యాయం చేయడం లేదన్నారు. మిగిలిన గ్రామాలకు భూమికి నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. నిధులు కేటాయించకుండా మండల హెడ్ క్వార్టర్లు ఇంటి సర్వే పేరుతో స్ట్రక్చర్ వేల్యూలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని దుయ్యబట్టారు. ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని, ప్రజలందరినీ ఒక్క తాటి మీద తెచ్చి ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శి కొండా ఈశ్వర్లు, నాయకులు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య

సిపిఎం రాష్ట్ర కమిటీకి జిల్లా నేతల ఎన్నిక

ప్రజాశక్తి- పాడేరు, విఆర్.పురం

నెల్లూరులో ఈ నెల 1, 2, 3 తేదీలలో జరిగిన సిపిఎం రాష్ట్ర మహాసభల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి కిల్లో సురేంద్ర రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నిక కాగా, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు..

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.అప్పలనర్స, బి.కిరణ్

పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్

ఎన్నికల కోడ్ అమలుపై సమీక్ష

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుపై ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్ గ్రామాలలో అమలు చేయడంపై ఆరా తీశారు. గ్రామ పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియామవాళిని అతిక్రమించిన సిబ్బందిపై చర్యలుంటాయని హెచ్చరించారు. విగ్రహాలకు గౌరవ ప్రధంగా ముసుగువేయాలని, సంబంధిత పార్టీ వారికి సమాచారం ఇచ్చి ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు. రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల వ్యక్తులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని గౌరవించాలన్నారు. ర్యాలీలు, ఎన్నికల ప్రచారాలకు సంబంధిత వ్యక్తులు, వాహనాలకు అనుమతులు పొందాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మద్యం, నగదు పంపిణీ చేయకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాడేపల్లి పంచాయతీలో నీలవరం, మల్లవరం అవాసలలో ఉన్న పాఠశాలలు పరిశీలించి మోడల్ కోడ్ అమలు చేయాలని ఆదేశించారు.

మన్యంలో జర్మనీవాసుల సందడి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను 19 మంది జర్మనీ వాసులు తిలకించారు. యుసిఐఎం చర్చి సమీపంలో హాస్టల్ విద్యార్థులతో మమేకమై ఆనందాన్ని పంచుకున్నారు. ముందుగా గిరిజన ఆచార సాంప్రదాయాలు తెలుసుకోవటానికి ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కేందుగూడ గ్రామానికి సీలేరు నదిపై పడవలో ప్రయాణం చేసి వెళ్లారు. అక్కడ జర్మనీ వాసులకు గిరిజనులు పూలమాలవేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం గిరిజనలుతో సమావేశమై వారి ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నారు. వివిధ గిరిజనుల థింసా, ఇతర నృత్యాలు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆ నృత్యాలను తమ కెమెరాల్లో బంధించారు. ఒడిశా రాష్ట్రం చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి గుంటవాడ సమీపంలో ఉన్న కోందు గ్రామానికి చేరుకొని వారి జీవన సరళి తదితర అంశాలపై కాసేపు ముచ్చటించారు. సోమవారం జర్మనీవాసులు సీలేరు నుంచి వయా రంపచోడవరం మీదగా దారి పొడవున ప్రకృతి రమణీయమైన దృశ్యాలను తిలకిస్తూ రాజమండ్రి చేరుకుని, అక్కడ నుంచి స్వదేశానికి పయనమయ్యారు. ఈ పర్యటనలో సీలేరు, బచ్చులూరు, వలసగెడ్డ యుసిఐయం చర్చ్ పాస్టర్లు మనసై, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణిస్తున్న జర్మనీ దేశస్తులు

గుమ్మరేవులు బస్సును పునరుద్ధరించరూ..

ప్రజాశక్తి -సీలేరు

జీకేవీధి మండలం గుమ్మరేవులు బస్ సర్వీసును తక్షణమే పునరుద్ధరించే విధంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడీపీ పిఒ చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత గిరిజనులు వేడుకుంటున్నారు. పోలీసులు చొరవతో మారుమూల గిరిజన గ్రామాలకు ప్రయాణ సౌకర్యం కలిగించేలా నర్సీపట్నం డిపో వారు నర్సీపట్నం నుండి చింతపల్లి, గూడెం, దారకొండ మీదుగా గుమ్మరేవులు వరకు బస్సు నడిపేవారు. అయితే 2024 సెప్టెంబర్ 8న అర్ధరాత్రి వరద బీభత్సానికి దారకొండ-గుమ్మిరేవులు మార్గమధ్యలో రహదారులు, కల్వర్టులు పూర్తిగా కొట్టుకుపోయి రహదారి అస్తవ్యస్తంగా మారింది. దీంతో గుమ్మిరేవులు బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. ఆర్ అండ్ బి అధికారులు గుమ్మిరేవులు వంతెన సమీపం నుండి మట్టితో అప్రోచ్ రోడ్డు తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. నేటికీ రహదారి కల్వర్టులు నిర్మించలేదు. దీంతో బస్సును పునరుద్ధరించకపోవడంతో మారుమూల గ్రామాల గిరిజనులు, విద్యార్థులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుమ్మిరేవులు బస్సు సౌకర్యం లేకపోవడంతో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి విధులకు హాజరు కాలేకపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు వచ్చేటప్పుడు మైదాన ప్రాంతానికి వెళ్లి తిరుగు విధులకు హాజరుకావడానికి ఈ బస్సు ఎంతగానో దోహదపడేది. ఐదు నెలలుగా బస్సు నిలిచిపోవడంతో ఈ ప్రాంత ప్రజలతోపాటు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి గుమ్మరేవులు బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

గుండెపోటుకు గురైనవారికి ఉచితంగా టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్

ప్రజాశక్తి-రంపచోడవరం

గుండెపోటుకు గురైన రోగులు స్థానిక ఏరియా ఆసుపత్రికి వస్తే వారికి ఈసీజీ పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి 50 వేల రూపాయలు విలువైన టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ ఉచితంగా చేయబడుతుందని రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ టీవీ శేషారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరంలో ఇలా గుండెపోటుకి గురైన సుమారు 13 మంది రోగులకు టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్‌ను ఉచితంగా వేసినట్లు పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మార్చి 8 వరకు 'మీ కోసం' రద్దు

ప్రజాశక్తి-పాడేరు: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గం, తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్ర నియోజకవర్గానికి సంబంధించి శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమ, బుధ, శుక్రవారంలలో రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలు, జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మార్చి 8వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారులు ఎవరు ఫిర్యాదులు, విజ్ఞప్తులు అందించడానికి రావద్దని కలెక్టర్ సూచించారు.

కేలండర్‌ను ఆవిష్కరించిన డిఎంఅండ్ హెచ్ఓ

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పాడేరు టౌన్: అల్లూరి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ 2025 వార్షిక క్యాలెండర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ షేక్ జమాల్ భాషా సోమవారం ఆవిష్కరించారు. క్యాలెండర్ ను ఆవిష్కరించిన డిఎంఅండ్ హెచ్ఒకు ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎంవిఆర్ ప్రభాకర్, కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఏలియా మృతి


కొర్ర ఏలియా (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- అరకులోయ:అరకులోయ మండలం శరభగూడ గ్రామానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు కొర్ర ఏలియా మృతి చెందాడు. ఇటీవల వాహనంపై ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై కొద్ది రోజులుగా విశాఖపట్నంలోని పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖ కే జి హెచ్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడు ఏలియా మండలంలోని బస్కి కి గిరిజన సంక్షేమ శాఖ బాలుర పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అందరికి సుపరిచితుడైన కొర్ర ఏలియా మాస్టారు మృతి చెందడంతో అరకులోయ, శరబ గూడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జీడి మామిడి తోటల బహిరంగ వేలం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక జిల్లా ఫారెస్ట్ కార్యాలయ ఆవరణలోని నర్సీపట్నం, అనకాపల్లి రేంజ్ పరిధిలో గల జీడి మామిడి తోటలకు బహిరంగవేలాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. నర్సీపట్నం రేంజ్ పరిధిలో చినరాచపల్లి, నాతవరం, ఆరిలోవ, కోటవురట్ల, అహ్మద్ షరీఫ్ తోట, అనకాపల్లి, చోడవరం రేంజ్ పరిధిలో జీడి మామిడి తోటల నుండి వచ్చే ఫలసాయాన్ని సేకరించుటకు గాను బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ సామ్యూల్ మాట్లాడుతూ, 18 ప్లాంటేషన్స్ లో 639 హెక్టార్లలో జీడి మామిడి తోటలను బహిరంగ వేలం వేశామన్నారు.ఇందులో ఐదు ప్లాంటేషన్లకు వేలం జరపగా 32 లక్షల 43 వేల ఆదాయం వచ్చిందన్నారు. వేలం జరగని ప్లాంటేషన్లను అటవీ శాఖ పరిధిలో సేకరించడం జరుగుతుందన్నారు.అటవీ సంపదను అక్రమంగా ఎవరైనా పొందాలని చూసినా చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు.అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రతి మూడు మీటర్లకు ఒక లైన్ ఉంటుందని తెలిపారు. దీంతో అగ్గి రాజుకోకుండా ఉంటుందని వివరించారు. అడవులను రక్షించడం అందరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల కరక కొండపైకి సర్వేలో భాగంగా వెళ్లిన వారిని అడ్డగించడం జరిగిందని దానిపై విచారణ జరుగుతుందని అనంతరం సరైన చర్యలు ఉంటాయని సామ్యూల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి లక్ష్మీనర్స్, ఆటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

12న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్

పాడేరులో సమావేశమైన ఆదివాసి ఉద్యమ జెసి నేతలు

ప్రజాశక్తి- పాడేరు టౌన్: ఇటీవల విశాఖలో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా మన్యం బంద్ కు ఆదివాసి ఉద్యమ జెసి పిలుపునిచ్చింది. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆదివాసీలకు అయ్యన్న క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించింది. 1/70 చట్టాన్ని సవరణ చేయాలని స్పీకర్ కొత్త డ్రామాకు తెర లేపడాన్ని మండిపడింది. ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ గిరిజన చట్టాలు, హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించింది. సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు గిరిజన భవనంలో ఆదివాసీల చట్టాలపై స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర, డిసిసి జిల్లా అధ్యక్షుడు శతక బుల్లిబాబు, బిఎస్ పి జిల్లా అధ్యక్షుడు అప్పారావు, జెసి నాయకులు విశ్వేశ్వరరావు, మన్మధరావు, సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కిల్లో చిన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అనంతగిరి మండలం, బొర్ర పంచాయితీ గేటువలస గ్రామానికి చెందిన కిల్లో చిన్న గుండె పోటుతో ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ టీడీపీ పార్టీ మండల కమిటీని పంపించారు. సోమవారం మృతుడి భార్య కలిమ కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేసి ఓదార్చారు. ప్రభుత్వం, పార్టీ నుండి రావాల్సిన రాయితీలు వచ్చేలా పార్టీ పెద్దలతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి ఆనంద్, బొర్ర సర్పంచ్ జన్ని అప్పారావు, మాజీ సర్పంచ్ దొన్నుబిల్ల లక్ష్మణ రావు, ప్రసన్న కుమార్, శ్యాం, జగన్ పాల్గొన్నారు.

1/70 చట్టం సవరణతో ఆదివాసీలకు ముప్పే

ప్రజాశక్తి - నర్సీపట్నంటౌన్: 1/70 చట్టం సవరణతో ఆదివాసీలకు ముప్పేనని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా నాయకులు ధనార్జన్, ఇతర సభ్యులు ఖండించారు. సోమవారం ఆదివాసి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్ట సవరణలు సవరించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. 1/70 చట్టం సవరణ జరిగితే ఆదివాసీలకు భూమి మీద హక్కు, స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. అమాయక గిరిజనుల భూములను పెట్టుబడిదారులు కారు చౌకగా కొనుగోలు చేస్తారన్నారు. దీంతో, గిరిజనులకు జీవనోపాధి లేకుండా పోయే ప్రమాదం ఉందని తెలిపారు. అరకు, లంబసింగి ప్రాంత అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఉంటే ప్రభుత్వం ద్వారా స్టార్ హోటల్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచింది, అరకు, లంబసింగి ప్రాంతంలో కాఫీ డెవలప్ మెంట్ ఇండస్ట్రీ (ప్రాసెసింగ్ యూనిట్) ప్రభుత్వం ద్వారా పెట్టి గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల్ని కల్పించాలని కోరారు. 1/ 70 చట్టాన్ని సవరణ చేయకుండా ఈ విధమైన నిర్ణయాలు తీసుకొని గిరిజన అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. 1/70 చట్టం సవరణ జరిగితే ఆదివాసులకు అపారమైన నష్టం, అన్యాయం చేసినవారవుతారని, ఒకసారి పునరాలోచించాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో ఆదివాసి ప్రజా సంఘాలతో ఉద్యమాలు చేయడానికి వెనుకాడబోమని తెలిపారు.

మద్యం షాపులు కేటాయించాలి

కల్లు గీత సంఘం సభ్యుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మండల పరిధిలో కల్లుగీత సహకార పారిశ్రామిక సంఘాలకు మద్యం షాపులు కేటాయించాలని కల్లుగీత సహకార పారిశ్రామిక సంఘాల సభ్యులు స్థానిక రెవెన్యూ డివిజనల్ కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనేక సంవత్సరాల నుండి నర్సీపట్నం మండల పరిధిలో 600 మంది యాత ఉపకులానికి చెందిన గీత కార్మికులు ఉన్నారని వీరికి సంవత్సరంలో కేవలం మూడు నెలల మాత్రమే కల్లుగీత పని ఉంటుందని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో మండలానికి ఒక మద్యం షాపు చొప్పున రిజర్వేషన్ పరిధిలో కేటాయించాలని నర్సీపట్నం డివిజన్లో ఉన్న కల్లుగీత కార్మికుల కుటుంబాలకు మద్యం షాపు కేటాయించలేదన్నారు. మద్యం షాపులు కేటాయించి కల్లుగీత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత సహకార పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షులు బి నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ నూకరాజు, అనసూరి రాంబాబు , టి.అప్పారావు, ఈరెల్లి చిరంజీవి, ఎం సత్తిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కత్తితో యువతి హల్‌చల్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: పట్టణంలో ఓ యువతి సోమవారం కత్తి పట్టుకుని రోడ్డుపై తిరుగుతూ హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. ఆమెను ప్రశ్నించిన కొంతమందికి తాను ప్రభుత్వ ఉద్యోగినని బదులిచ్చింది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న టౌన్ సీఐ గోవిందరావు ఆమెను విచారించి వివరాలు రాబట్టారు. నర్సీపట్నం శారదా నగర్ కు చెందిన ఆమెగా గుర్తించారు. వెంకట అప్పల సూర్య నారాయణ రాజు కుమార్తె గణపతిరాజు భూదేవిగా గుర్తించారు. ఆమె కొన్నాళ్ళుగా మానసికంగా బాధపడుతుందని పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- డిప్యూటీ డిఇఒ అప్పారావు

ప్రజాశక్తి -నక్కపల్లి:పదో తరగతిలో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తీర్చిదిద్దాలని డిప్యూటీ డిఈఓ అప్పారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సోమవారం డిఎల్ పురం, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు ప్రత్యేక తరగతులను నిర్వహించి సబ్జెక్టుల వారిగా విద్యార్థులకు బోధించి, సందేహాలను నివృత్తి చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి, వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. పదిలో మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిఎల్ పురం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. మూడు, ఎనిమిదవ తరగతి పిల్లల స్థాయిని నేరుగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు నరేష్, వేమగిరి నూకరాజు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:నిరక్షరాస్యులను అక్షరాస్య లుగా తీర్చిదిద్దారని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం వాలంటీర్ టీచర్లకు ఉల్లాస్ కార్యక్రమం పై శిక్షణ ఇచ్చారు. పంచాయతీకి 10 నుండి 20 మంది నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ఆయా పంచాయతీ గ్రామాల్లో అంగన్వాడి కేంద్రం లేక కమ్యూనిటీ హాలు నందు విద్యను అందించాలని సూచించారు. వాలంటీర్ టీచర్లకు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కే నరేష్, ఏపిఎం శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

హైవేపై సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలో హైవేపై అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ రాయవరం మండలం ధర్మవరం హైవే నుంచి పాయకరావుపేట పట్టణం వరకూ హైవే జంక్షన్ల లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సిఐలు కుమారస్వామి జి.అప్పన్న, ఎల్ .రామకృష్ణ పర్యవేక్షణలో సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు పనులను ప్రారంభించారు. 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యాంజలి విద్యార్థి కుశ్వంత్ ప్రతిభ

ప్రజాశక్తి -కొత్తకోట:అనకాపల్లిలోని ఏడి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జోనల్ లెవెల్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ జోనల్ లెవెల్ పోటీలలో రావికమతం మండలం కొత్తకోట విద్యాంజలి స్కూల్‌కు చెందిన 2వ తరగతి విద్యార్థి కేశంశెట్టి కుశ్వంత్ మొదటి స్థానం సాధించాడు. ఆ విద్యార్థిని స్కూల్ ప్రిన్సిపాల్ గట్టా వర ప్రసాద్ సోమవారం ప్రశంసా పత్రం, మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ పోటీలలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు అందులో విద్యార్థి కుశ్వంత్ అత్యంత ప్రతిభ చూపి ట్రోపి సాధించాడు. అలాగే పలువురు విద్యార్థులకు పార్టిసిపికేషన్ ధ్రువ పత్రాలు అందజేశారు..

సర్పంచ్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి- మాడుగుల: జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికై గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో జరిగిన వేడుకల్లో అవార్డు పొందిన మాడుగుల మండలం వీరవిల్లిగ్రహారం గ్రామ సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి ఈశ్వరరావు దంపతులను సోమవారం ఆ గ్రామంలో పెద్దలు సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

ఎస్తేరు రాణిని సత్కరిస్తున్న పాఠశాల కమిటీ

ప్రజాశక్తి -ఆనందపురం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు స్వీకరించిన స్థానిక కస్తూర్బా విద్యాలయ బయాలజీ టీచర్ పి.ఎస్తేరురాణిని సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చైర్మన్ కోరుకొండ శివాజీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సత్కరించారు. ప్రజా సంకల్ప వేదిక గ్రీవెన్స్ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బొద్దపు బంగార్రాజు, పాఠశాల కమిటీ వైస్‌చైర్మన్ అప్పన్న . కో ఆప్షన్ సభ్యుడు. అక్కిరెడ్డి దేవుడుబాబ పాఠశాల ప్రిన్సిపల్ సత్య లావణ్య గ్రామపెద్ద అప్పలరాజు పాల్గొన్నారు

స్వచ్ఛందంగా పాఠశాల భవన నిర్మాణం

పాఠశాల భవనం వద్ద రౌండుటేబుల్ సంస్థ ప్రతినిధులు,అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖపట్నం రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మండలంలోని గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ. 50లక్షలతో నాలుగు గదుల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. కేశవ మజ్జి, అనికేత వర్మ, మురళి, గన్నమని తదితర దాతలు, సంస్థ సభ్యుల సహకారంతో దీన్ని నిర్మించగా, పాఠశాలకు కావలసిన మిగిలిన సౌకర్యాలను సమకూరుస్తామన్నారు. ఈ సందర్భంగా కెసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రౌండు టేబుల్ సంస్థ చక్కని భవనాన్ని సమకూర్చిందని, పెద్ద సంఖ్యలో పిల్లల్ని చేర్చుకుని, పాఠశాలను అభివృద్ధిలోకి తేవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, గ్రామస్తులు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా స్వచ్ఛందంగా భవనం సమకూర్చిన సంస్థ ప్రతినిధులకు హెచ్ఎం యువివి.ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఎంఇఒలు వి.జోగిందర్ నాథ్, గంగరాజు, రౌండ్ టేబుల్ సభ్యులు అభిషేక్, చైతన్య, అమిత్ చౌదరి, మక్సుద్ అహ్మద్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పిఎన్ఎం హైస్కూల్, కెజిబివి, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు మండలంలోని చిప్పాడ దివీస్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను సోమవారం అంద జేశారు. ఎంఇఒలు ఎం.శివరాణి, జయప్రద, ప్రభుత్వ డైట్ అధ్యాపకులు త్రినాధరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్, ప్రతినిధులు శేఖర్‌బాబు పాల్గొన్నారు.

విసిసి గాజువాక జోన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక :వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) గాజువాక జోన్ మహాసభ సోమవారం సరస్వతి విద్యానికేతన్‌లో నిర్వహించారు. ఒది. ఈ సందర్భంగా కన్వీనర్ బి.అప్పారావు మాట్లాడుతూ, జోన్ పరిధిలో 15 విసిసి క్లబ్‌లు ఉండగా, మూడేళ్లకోసారి నిర్వహించే మహాసభల్లో పిల్లలు, పెద్దలతో కొత్త కమిటీల ఎన్నిక జరుగుతుందన్నారు. గాజువాక మహాసభకు ఎనిమిది కమిటీల నుంచి 30మంది హాజరుకాగా, పెద్దల కమిటీ కన్వీనర్‌గా బి.అప్పారావు, కో కన్వీనరుగా ఆర్.స్వర్ణలత, పిల్లల కమిటీ ప్రెసిడెంట్‌గా పి.దుర్గాశ్రావణి, సెక్రటరీగా పి.లావణ్య, వైస్ ప్రెసిడెంట్‌గా సిహెచ్.బాలాజీ, జాయింట్ సెక్రటరీగా నితిన్, సభ్యులుగా మరో ఆరుగురిని ఎన్నుకున్నారు.

గ్రామీణ వైద్యుడు వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కూనవరం : కూనవరం మండలం కాచవరం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు (ఆర్ఎంపి) తాత బాలయోగి (54) తీవ్రమైన కాలేయ వ్యాధి .(లివర్ సిర్రోసిస్)తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి గ్రామీణ వైద్యులు బాలయోగి సోమవారం ఇంటికి వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. చింతూరు డివిజన్ ముంపు మండలాల గ్రామీణ వైద్యుల సహాయక సంఘం తరుపున రూ.25,500 ఆర్థిక సహాయాన్ని బాలయోగి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షులు ఎస్కె అనీఫ్, కూనవరం మండల అధ్యక్షులు అయినబోయిన సురేష్ మాట్లాడుతూ తోటి గ్రామీణ వైద్య మిత్రుడు బాలయోగి లివర్ సిర్రోసిస్ వ్యాధితో అనారోగ్యానికి గురికావడం చాలా బాధాకరమని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సాటి మిత్రుడు ఆపదలో ఉన్నాడని తెలియజేసిన వెంటనే స్పందించిన గ్రామీణ వైద్య మిత్రులు మానవత దృక్పథంతో తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బాలయోగి భార్య లక్ష్మీకాంతం కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తన భర్త ఆరోగ్య పరిస్థితులను తెలియజేశారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు మంచంపట్టడంతో వైద్యానికి కూడా డబ్బుల్లేక దిక్కులేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పరీక్షలు చేసి మందులతో నయం కాదని, కాలేయ మార్పిడి ఒకటే మార్గమని డాక్టర్లు తేల్చి చెప్పారని, ప్రస్తుతం ఇంటి వద్దనే మందులు వాడుతున్నామని చెప్పారు. దాతలు సహాయం చేసి తన భర్త వైద్యానికి సహకరించాలని ఆమె కోరారు. దాతలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూనవరం బ్రాంచ్ అకౌంట్ నెంబర్ 31522 778668, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0008795కు విరాళాలు ఇవ్వాల్సిందిగా అర్థించారు. ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ గ్రామీణ వైద్యులు తిరుపాల్, ఆర్.రమేష్, సైదా రెడ్డి, రఘు, కిరణ్, అశోక్, సాగర్, వెంకన్న, నరసింహారావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి తగ్గట్టుగా విద్యుదుత్పత్తి

ట్రాన్స్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి టార్గెట్ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నట్లు ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి 478 మిలియన్ యూనిట్లు టార్గెట్గా నిర్దేశించారన్నారు. నిర్దేశించి సమయానికి విద్యుత్ ఉత్పత్తి పూర్తి చేయడానికి ఇంజనీర్లు, కార్మికులు సమిష్టిగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం జల విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నామని తెలిపారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 418.62 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశామని చెప్పారు. 2024-25 మార్చి చివరి నాటికి టార్గెట్‌ని చేరుకోవడానికి మరో 59.38 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయవలసి ఉందన్నారు. జల విద్యుత్ కేంద్రంలో సమస్యలను అధిగమించి మార్చి 31 చివరి నాటికి విద్యుత్ టార్గెట్‌ను పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

బస్ షెల్టర్ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో బస్ షెల్టర్ నిర్మాణాన్ని కొంతమంది టిడిపి కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని, అది సరైన పద్ధతి కాదని డిసిసి కార్యదర్శి పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ సీలేరు మార్కెట్ సెంటర్ పంచాయతీ పరిధిలో ఉన్న బస్ షెల్టర్, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. దీనిపై స్థానిక ఏపీ జెన్కో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా నిర్మాణం చేసుకోవడానికి సూత్రపాయంగా అంగీకరించారని పేర్కొన్నారు.

ఎంపీ నిధులు నుండి ఈ పనులు చేపడుతుండగా కొంతమంది టిడిపి కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రయాణికులకు ఉపయోగపడే బస్సు షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు అడ్డుకోవడం విడ్డూరంగా పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణంపై దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని కోరారు.

గీతం విసిగా డాక్టర్ ఎరోల్ డిసౌజా

డాక్టర్ ఎరోల్ డిసౌజా

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్‌గా ఐఐఎమ్, అహ్మదాబాద్ విశ్రాంతి డైరక్టర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్థిక శాస్త్రంలో నిపుణులైన డాక్టర్ డిసౌజా, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా, నేషనల్ హౌసింగ్ బ్యాంక్, భారత ప్రణాళికా సంఘం, నీతి అయోగ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీలకు సలహాదారుగా వ్యవహరించారు. ప్యారిస్‌లోని సైన్సెస్ పో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ సీనియర్ ఫెలోగా, సిమ్లాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టడీ విజిటింగ్ ప్రొఫెసర్‌గా, కొలంబియా విశ్వవిద్యాలయం విజిటింగ్ స్కాలర్‌గా సేవలందించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసిఎస్ఎస్ఆర్) నిపుణుల కమిటీలలో సభ్యుడుగా ఉన్నారు. ఇండియన్ జర్నల్ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ జర్నల్‌ల సంపాదకవర్గం సభ్యుడుగా వ్యవహరిస్తున్నారు. ప్రొఫెసర్ డిసౌజా నియామకం పట్ల గీతం సలహాదారు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.

జగజ్జేత అండర్ -19 క్రికెట్ జట్టులో సభ్యురాలు

షబ్నమ్ షఖీల్‌కు అభినందన

షబ్నమ్‌ను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి -కరాస: క్రికెట్ ద్వారా విశాఖ నగరకీర్తిని పలువురు స్థానిక క్రీడాకారులు విశ్వవిఖ్యాతం చేయడం ఆనందంగా ఉందని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. నగరం నుంచి భారత క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంపై హర్షం వెలిబుచ్చారు. సోమవారం తన నివాసంలో ఇటీవల విశ్వవిజేతగా నిలిచిన అండర్ -19 వరల్డ్‌కప్ జట్టులోని సభ్యురాలైన విశాఖ 52వ వార్డుకు చెందిన షబ్నమ్ షకీల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రెండోసారి భారత్‌కు ప్రపంచకప్ అందించిన అండర్-19 క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. జట్టులో విజయంలో కీలకపాత్ర పోషించిన తెలుగుతేజం షబ్నమ్ షఖీల్‌కు అభినందనలు తెలిపారు. ప్రపంచకప్ పోటీలకు వెళ్లేముందు షబ్నమ్‌ను తాను సత్కరించిన సందర్భాన్ని శ్రీధర్ గుర్తు చేశారు. ను ఆయన ప్రత్యకంగా అభినందించారు.ఈ సందర్భంగా ప్రపంచకప్ కు వెళ్లే ముందు షబ్నమ్ ను తన నివాసంలో కలిసి సత్కరించిన క్షణాలను శ్రీధర్ గుర్తు చేసుకున్నారు. ప్రపంచకప్ గెలుచుకున్న రెండుసందర్భాల్లోనూ షబ్నమ్ భారతజట్టును జగజ్జేతగా నిలపడంతో కీలకభూమిక పోషించిందని, ఆమెకు ప్రోత్సాహమిచ్చి, సహకరించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మేనేజ్‌మెంట్, కోచింగ్ బృందానికి శ్రీధర్ అభినందనలు తెలిపారు.షబ్నమ్‌ను ఆటల్లో ప్రోత్సాహించిన ఆమె తండ్రి షఖీల్‌ను శ్రీధర్ అభినందించారు.

సరస్వతీదేవి జయంతి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాలలో సోమవారం సరస్వతి దేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల కిరణ్‌కుమార్ విద్యార్థులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

నాలుగు టెన్త్ పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:మండలంలోని ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఈఓ సత్యనారాయణ దొర తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పలు పాఠశాలలను సందర్శించారు. మండలంలోని రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగి, సింగంపల్లి, జడ్డంగి ఆశ్రమ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 527 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

దోనెలపాలెంలో ఆధార్ శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని మారుమూల గ్రామమైన దోనెలపాలెంలో సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజులు ఆధార్ శిబిరం నిర్వహించినట్లు ఎంపీడీవో యాదిగిరేశ్వరరావు సోమవారం తెలిపారు. ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేస్తున్న ఈ ఆధార్ కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే ఆధార్ అప్డేట్ చేస్తారని, ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో రవి 'ప్రతాపం'

ప్రజాశక్తి- విశాఖపట్నం : జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విశాఖ నగరంలోని పెందుర్తి మండలం పెదగాడి పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.రవిప్రతాప్ సత్తా చాటారు. గతనెల 31 నుంచి ఈనెల 3 సోమవారం వరకు కేరళలోని కన్నకులం బాలుర సెకెండరీ స్కూల్ స్పోర్ట్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆరవ జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో రవి ప్రతాప్ వంద మీటరల హర్డిల్స్‌లో నాలుగోస్థానం, 200మీటర్ల రన్నింగ్‌లో రజత పతకం సాధించారు. జాతీయస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి మాస్టర్స్ క్రీడాకారులు పాల్గొన్నారు.